అన్ని పనులకూ యంత్రాలే!

- వ్యవసాయంలో పెరుగుతున్న యంత్రాల వినియోగం
- కాడెద్దులకు తగ్గుతున్న అదరణ
- యంత్రాలతో ఖర్చు తక్కువ, సమయం ఆదా


కాడెద్దులతో విత్తనాలు వేస్తున్న దృశ్యం(ఫైల్)


ట్రాక్టర్ ద్వారా పొలం దున్నుతున్న దృశ్యం (ఫైల్)

మడకశిరరూరల్: గతంలో పొలం దున్నాలన్న, విత్తనం వేయాలన్నా, పండించిన పంటను ఇంటికి తీసుకురావాలన్నా కాడెద్దులు, ఎండ్ల బండిని ఉపయోగించేవారు. కానీ మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు వ్యవసాయ యాంత్రీకరణ వైపు మొగ్గ చూపుతున్నారు. దీంతో ట్రాక్టర్లు, పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. యంత్రాల రాకతో ఇప్పుడు కాడ్డెదుల వినియోగం తగ్గింది. గ్రామాల్లో అడపదడపా తప్పా ఎక్కువగా కనిపించడం లేదు. వ్యవసాయంలో రైతులకు వెన్నెముకగా నిలిచిన ఎడ్లబండ్లు నేడు ఉనికిని కోల్పోతున్నాయి.

యంత్రాలపైనే రైతులు మొగ్గు

వ్యవసాయం చేసే ప్రతి రైతు ఇంటి వద్ద ఎడ్లబండి, పశువులు, పశువుల పాక ఉండేది. ఎడ్లబండ్లు ఉన్న వారికి సంవత్సరమంతా పని ఉండేది. రైతులు ఆనందంగా ఉండేవారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడంతో ఎడ్లబండ్లకు ప్రాధాన్యత తగ్గింది. సాంకేతికత పెరిగిపోవడంతో రైతులు తక్కువ సమయంలోనే పనులు ముగించుకునేలా అధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. రైతు ఇంటి ముందు ట్రాక్టర్లు దర్శనమిస్తున్నాయి. ఒకటి, రెండు ఎడ్లబండ్లు ఉన్నా వారిని బాడుగకు పిలిచే వారు లేరు. తక్కువ సమయంలో ఎక్కువ వ్యవసాయ పనులు చేసేలా అధునిక యంత్రాలు రావడంతో అందరు వాటిపైనే మొగ్గు చూపుతున్నారు.

సబ్సిడీపై యంత్రాలు

ఒకప్పుడు ఎలాంటి ప్రభుత్వ ప్రోత్సాహం లేకుండానే వ్యవసాయం చేసుకునేవారు. కానీ ప్రభుత్వాలు వ్యవసాయానికి వివిధ రకాల పథకాలు అమలు చేస్తున్నాయి. సన్న, చిన్నకారు రైతులకు కూడా సాంకేతిక అధునిక యంత్రాలు సబ్సిడీపై అందజేస్తున్నారు. ట్రాక్టర్‌తో పాటు వివిధ రకాల విత్తనాల గొర్రులు, కోత మిషన్లు, రోటావేటర్ తదితర వాటిని ఇస్తున్నారు. తక్కువ పెట్టుబడితో వాయిదాల రూపంలో యంత్రాలు అందుబాటులోకి రావడంతో రైతులు ఎద్దులు వ్యవసాయానికి ఆసక్తి చూపడం లేదు.

గతంలో కాడ్డెదులకు డిమాండ్

గతంలో వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందు రైతులు ఎద్దులు, బండ్లు సిద్ధం చేసుకునేవారు. వాటికి మంచి డిమాండ్ ఉండేది. సాగుకు అవసరమైన వ్యవసాయ పనులు చేయించుకునేందుకు ముందుగానే ఎద్దులు, బండ్లు ఉన్న వారికి డబ్బును అడ్వాన్స్‌గా ఇచ్చేవారు. కూలీలకు కూడా డిమాండ్ బాగా ఉండేది. ఇప్పుడు కూలీలతో కలుపు తీయుటకు, మందులు చల్లడానికి మత్రమే వినియోగిస్తున్నారు. యంత్రాలతో పనులు చేయించడం వల్ల ఖర్చు తక్కువతో పాటు సమయం అవుతుందని రైతులు చెబుతున్నారు.

మూడు జతల కాడెద్దులు ఉండేవి



నాకు 6 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉంది. 15 ఏళ్ల క్రితం మూడు జతల కాడెద్దుల ద్వారా కూలీలతో వ్యవసాయం చేసే వాళ్లం. కూలీలు కూడా దొరకడం కష్టంగా ఉండడంతో పాటు పశుపోషణ సమస్య ఉన్న సమయంలో యాంత్రీకరణ అందుబాటులోకి వచ్చింది. అప్పటి నుంచి పొలంలో ట్రాక్టర్‌తోనే వ్యవసాయం చేస్తున్నాం. ఈ విధంగా ట్రాక్టర్ ద్వారా వ్యవసాయ పనులు చేయడం వల్ల సమయం ఆదాతో పాటు ఖర్చు కూడా తగ్గుతుంది.

– శ్రీరామరెడ్డి ,రైతు ఎల్లోటి మడకశిర మండలం

ట్రాక్టర్‌తో వ్యవసాయ పనులు



నాకు 8 ఎకరాల పొలం ఉంది. కాని కాడెద్దులు లేకపోవడంతో కాడెద్దుల ఉన్న వారికి బాడుగ చెల్లించి పొలంలో వ్యవసాయ పనులు చేయించేవాడిని. ట్రాక్టర్లు వచ్చినప్పటి నుంచి కాడెద్దులు వినియోగం తగ్గింది. ట్రాక్టర్లతోనే వ్యవసాయం చేసుకుంటున్నాం. గతంలో కాడెద్దులతో పని చేయించాలంటే రోజంతా కష్టపడేవారం. ట్రాక్టర్ ద్వారా అయితే గంటలోనే పని అయిపోతుంది. భూమి దున్నేప్పటి నుంచి వ్యవసాయ పనులన్నీ ట్రాక్టర్ ద్వారానే చేయిస్తున్నాం.

– వెంకటేష్, రైతు ఆర్.ఆనంతపురం, మడకశిర మండలం

క్లుప్తంగా

బీసీజీ వ్యాక్సినేషన్


కదిరేపల్లిలో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

అగళి: మండల వ్యాప్తంగా గురువారం టీబీ(క్షయ) నియంత్రణ చర్యల్లో భాగంగా డాక్టర్ శివనంద, గాయత్రి ఆధ్వర్యంలో బీసీజీ వ్యాక్సినేషన్ చేపట్టారు. 18 ఏళ్ల దాటిన, ఐదేళ్ల కిందట మందులు వాడి టీబీ వాధి తగ్గిన వారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, ధూమపానం అలవాటు ఉన్న వారు, 60 ఏళ్ల పైబడిన వారికి టీకా వేస్తున్నట్లు డాక్టర్ శివానంద్ తెలిపారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ


ఛత్రం పాఠశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం

మడకశిరరూరల్: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని కెనారా బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ హేమలత పేర్కొన్నారు. ఛత్రం ప్రాథమిక పాఠశాలలో గురువారం కెనారా బ్యాంకు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ మాట్లాడుతూ విద్యార్థులు మొక్కల నాటి వాటిని సంరక్షించాలన్నారు. మొక్కల పెంపకం ద్వారా కలిగి లాభాలను విద్యార్థులకు వివరించారు. హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు మాలతి, బాబు, రంగలక్ష్మీ, సంగీత, రాధిక తదితరులు పాల్గొన్నారు.

గుడిబండలో మోస్తరు వర్షం


ఫళారం గ్రామంలో కురుస్తున్న వర్షం

గుడిబండ: మండల వ్యాప్తంగా పలు చోట్ల గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. దాదాపు 15 రోజుల నుంచి కనీస వర్షపాతం నమోదు కాలేదు. ఎట్టకేలకు వర్షం కురవడంతో వేరుశనగ, కంది, రాగి, మొక్కజొన్న, తదితర పంటలు సాగు చేస్తున్న రైతులు హర్షం వ్యక్తం చేశారు.

8న ఎస్‌ఎంసీ ఎన్నికలు

మడకశిర/రొళ్ల: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ, ఎంజేపీ పాఠశాలల్లో ఈనెల 8న ఎస్‌ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలు నిర్వహించనున్నట్లు మడకశిర ఎంఈఓలు భాస్కర్, శ్రీధర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు ఈనెల 5లోగా ఓటరు జాబితాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 8న ఎస్‌ఎంసీ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక, ప్రమాణస్వీకారం ఉంటుందన్నారు. ఆయా పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు విషయాన్ని గమనించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


గోరంట్ల అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీఓ అనురాధ

గోరంట్ల: మండలంలోని మల్లాపల్లి, బూగనిపల్లి, కళ్లగేరి, గోరంట్ల మార్కెట్ వీధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం సోమందేపల్లి ప్రాజెక్టు సీడీపీఓ అనురాధ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో ఆహార పదార్థాల నిల్వలకు సంబంధించి రిజిస్టర్లను పరిశీలించారు. కేంద్రాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనం బోల్తా


బోల్తా పడిన వాహనం

అగళి: రామనపల్లి సమీపంలో గురువారం తెల్లవారుజామున ఓ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. వివరాలు..బొలెరో వాహనం రొళ్ల మండలం టీడీ హళ్లి నుంచి కీర(దోసకాయలు) లోడ్‌తో శిరాకు బయలుదేరింది. రామనపల్లి సమీపంలో అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. ఘటనలో వాహనంలో ఉన్న కాయలు రోడ్డుపై పడిపోయాయి. డ్రైవర్, అతడితోపాటు ఉన్న మరోవ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డారు.

కలిసికట్టుగా పని చేయండి


మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన పార్టీ మండల కన్వీనర్ రాము

హిందూపురం: నియోజకవర్గంలో కలిసికట్టుగా పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచించారని పార్టీ మండల కన్వీనర్ రాము తెలిపారు. గురువారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో రజక కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ మీసాల రంగన్నతో కలిసి మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసినట్లు పేర్కొన్నారు. హిందూపురంలోని రాజకీయ పరిస్థితులపై వివరించినట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని.. త్వరలో మంచి రోజులు వస్తాయని మాజీ సీఎం జగన్ చెప్పినట్లు వివరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

ధర్మవరం రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కేసీ కుళ్లాయప్ప నాయక్, అసిస్టెంట్ మలేరియా అధికారి ఆర్. లక్ష్మీనాయక్ సూచించారు. గురువారం ఓబుళనాయనపల్లి తండాలో దర్శనమల పీహెచ్‌సీ డాక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంప్‌ను వారు పరిశీలించారు. అనంతరం సీజనల్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరిగి లార్వా బ్రీడింగ్ పాయింట్స్ గుర్తించి వాటిని తొలగింపజేశారు. అదే విధంగా గ్రామంలో గల జ్వరం కేసులను గుర్తించి వారికి రక్త పూతలు తీసి వాటిని పీహెచ్‌సీ ల్యాబ్‌కు పంపుతామన్నారు.

నల్ల చట్టాల రద్దు ఘనత రైతులదే


రైతు సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టిన దృశ్యం

హిందూపురం అర్బన్: నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడి ఆ చట్టాలను రద్దు చేయించిన ఘనత రైతులదేనని రైతు సంఘాల నాయకులు జయరామిరెడ్డి, ఓపీడీర్ శ్రీనివాసులు, ఎంఐఎం నాయకులు, టిప్పూ సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్‌ఖాన్, బీఎస్పీ శ్రీరాములు పేర్కొన్నారు. గురువారం స్థానిక పట్టు గూళ్ల మార్కెట్‌లో రైతు సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నల్ల చట్టాల రద్దుకు 700 మంది వరకు రైతులు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. రైతుల ప్రాణాలు తీసిన అధికారులకు ఆగస్టు 15న పథకాలు, పురస్కారాలు అందించాలని నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. రైతులు, కార్మికులకు రుణమాఫీ, 2013 భూసేకరణ చట్టం అమలు చేసి అందుకు 4 రెట్లు పరిహారం అందించాలని కోరారు. 2020–21లో దేశ వ్యాప్తంగా జరిగిన రైతుల ఉద్యమ కేసులన్నింటినీ ఎత్తి వేయాలన్నారు. రైతులు, రైతు కూలీలకు పింఛన్లు ఇవ్వాలన్నారు. 200 పని దినాలు (ఉపాధి), రూ.700 వేతన భత్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నకిలీ ఎరువులు, పురుగు మందులు తయారీ దారులపై చర్యలు తీసుకొని నాణ్యమైన ఎరువులు, విత్తనాలు ప్రభుత్వమే అందజేయాలని కోరారు. గిరిజనులకు నీరు, అటవీ భూములపై హక్కులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో పట్టుగూళ్ల వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్సార్ ఖలీల్ బాషా, ఖాజా, షఫ్తక్ షబ్బీర్, దాదు, పలవీంద ర్సింగ్, భగవాన్ సింగ్ పాల్గొన్నారు.

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ముఖ్య కార్యదర్శి రమ

ధర్మవరం: పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయంలో సభ్యత్వాలతోపాటు పాఠకులను పెంచాలని సిబ్బందికి సూచించారు. గ్రంథాలయాధికారిణి అంజలి సౌభాగ్యవతి, సిబ్బంది సత్యనారాయణ, రమణ తదితరులు ఉన్నారు.

బస్సులు సకాలంలో నడపాలి

కదిరి అర్బన్: విద్యార్థుల సౌకర్యార్థం గ్రామీణ ప్రాంతాలకు బస్సులు సకాలంలో నడపాలని గురువారం ఎస్ఎస్‌యూఐ నాయకులు డిపో ముందు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కదిరిలో చదువుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థులు బస్సులు సకాలంలో రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కటారుపల్లికి బస్సు రావడం లేదన్నారు. అనంతరం అసిస్టెంట్ డీఎం హరిత సకాలంలో గ్రామీణప్రాంతాలకు బస్సులు నడుపుతామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. నాయకులు ఉపేంద్ర, శంకర్, హరి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రజారోగ్యం


అప్పలవాండ్లపల్లిలో టమాట పంటను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తచెరువు: ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల, ప్రజారోగ్యాన్ని కాపాడొచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సనావుల్లా పేర్కొన్నారు. మండలంలోని అప్పలవాండ్లపల్లిలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన యువరైతు బాల చంద్రరెడ్డి ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన టమాట పంటను పరిశీలించారు. అలాగే రైతు సుబ్బిరెడ్డికి చెందిన పొలంలో ప్రకృతి వ్యవసాయం కింద పాడిభూమి విత్తుకోవడం(పీఎండీఎస్)ను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఓ విద్యావతి, అబ్దుల్ అలీ, నటరాజ్ పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలపై అవగాహన


సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: కియా పరిశ్రమలోని అనుబంధ సంస్థల ఉద్యోగులకు గురువారం కియా యాజమాన్యం భద్రతా ప్రమాణలపై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రత, ఆరోగ్య సదుపాయాలపై సిబ్బందికి వివరించారు. పరిశ్రమలోని కార్ల సరఫరా, కాంట్రాక్టర్లతో సంభాషించే విధానం అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పరిశ్రమల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కేశవులు, కియా యాజమాన్యం పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

లేపాక్షి: మండల వ్యాప్తంగా 6,842 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా.. 6,600 మందికి పింఛన్ సొమ్ము పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ వాసుదేవ గుప్తా తెలిపారు. గురువారం 96.46 శాతం మందికి పింఛన్ అందినట్లు పేర్కొన్నారు. ఇందులో 41 మంది పింఛన్‌దారులు మృతి చెందగా మరో 201 మందికి సొమ్ము ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీని శ్రీసత్యసాయి జిల్లా ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్ పర్యవేక్షించారు.

సీసీ కెమెరాల కొనుగోలుకు టెండర్ల ఆహ్వానం

హిందూపురం టౌన్: స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో సీసీ కెమెరాల కొనుగోలు, పాత సీసీ కెమెరాల మరమ్మతులకు కంపెనీల నుంచి సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆస్పత్రిలో మొత్తం 25 నూతన సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు, డీవీఆర్, వైరింగ్‌తో పాటు 10 పాత సీసీ టీవీ కెమెరాలకు మరమ్మతులు చేయాల్సి ఉంటుందన్నారు. ఈనెల 5వ తేదీలోపు టెండర్లను ఆస్పత్రి కార్యాలయంలో అందజేయాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3:30 గంటలకు సూపరింటెండెంట్ చాంబర్‌లో తెరవడం జరుగుతుందన్నారు. తక్కువ టెండర్ కోడ్ చేసి వారి టెండర్ అంగీకరించబడుతుందని తెలిపారు. టెండర్లను రద్దు చేసే అధికారం సూపరింటెండెంట్‌కు ఉంటుందని గుర్తు చేశారు.

'శ్రావణ శనీశ్వరుడి'ని కొలుతము రారండి!


అలంకరణలో శనీశ్వర స్వామి

పావగడ: కర్ణాటక, తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన స్థానిక శనీశ్వరాలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శ్రావణ శనివారోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఈ నెల 5 నుంచి వచ్చే నెల 2 వరకు శ్రావణ మాస పూజలు ఆలయంలో వైభవంగా జరుగుతాయి. ఈ నెల 10 న తొలి శ్రావణ శనివారోత్సవం, 16 న ద్వితీయ శ్రావణ శుక్రవారం సందర్భంగా వరమహాలక్ష్మి పూజలు, 17 న ద్వితీయ శ్రావణ శనివారోత్సవం, 24 న తృతీయ శ్రావణ శనివారోత్సవం, 31 న చతుర్థ శనివారోత్సవం, జ్యేష్ఠాదేవి సమేత శనీశ్వర స్వామి వెండి పల్లకీ ఉత్సవం, శని త్రయోదశి పూజలు వైభవంగా జరగనున్నాయి. శ్రావణ మాసంలో శ్రావణ శనీశ్వరుడిని కొలిస్తే సకల పాపాలు తొలగి పోతాయని, ఏల్నాటి శని మటు మాయమై పోతుందని భక్తుల నమ్మకం. దీంతో శ్రావణ శనీశ్వర స్వామిని దర్శించుకుని పూజలు సమర్పించి పాపాలు పోగొట్టు కోడానికి తండోప తండాలుగా భక్తులు ఆలయానికి తరలివస్తారు. కాకి వాహనుడి కి ఇష్టమైన నల్ల నువ్వుల తైలం, నల్ల వస్త్రాలు సమర్పించి అభిషేక పూజలు చేస్తారు. నవగ్రహ పూజలు నిర్వహిస్తారు. అలాగే తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయం ఎదుట ఉన్న అగ్ని గుండం లోకి నల్ల నువ్వుల తైలం, నల్ల వస్త్రాలు, నవ ధాన్యాలు సమర్పించి 9 సార్లు అగ్ని గుండం చుట్టూ ప్రదిక్షణలు చేస్తారు. ఆలయంలో శనీశ్వరస్వామి కంటే ముందుగా కొలువుదీరిన శీతలాంభదేవికి కుంకుమార్చన పూజలు నిర్వహిస్తారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచే కాకుండా తమిళనాడు, మహరాష్ట్ర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలి వచ్చి స్వామి వారికి విశేష పూజలు నిర్వహిస్తారు. శ్రావణ మాస వేడుకలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ సమితి పదాధికారులు తెలిపారు.

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం


లేపాక్షిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్, వైద్య సిబ్బంది

లేపాక్షి: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం నుంచి బస్టాండ్ వరకూ ఐసీడీఎస్, వైద్య సిబ్బంది ర్యాలీ చేపట్టారు. సీడీపీఓ రెడ్డిరమణమ్మ మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వాలన్నారు. దీని వలన వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డకు 6 నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. 6 నెలలు నిండిన తరువాత తల్లి పాలతో పాటు ఆదనపు ఆహారం పెట్టాలన్నారు. బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వలన తల్లికి రొమ్ము క్యాన్సర్ రాదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వాసుదేవగుప్తా, డాక్టర్ వెంకట చిరంజీవి, సూపర్‌వైజర్లు జయమ్మ, శ్రీలక్ష్మి, మంజుళ, వరుణ్, ఎంఆర్‌సీ హరిణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

4న చౌడేశ్వరీ దేవి జయంతి

సోమందేపల్లి: తొగట వీర క్షత్రియుల ఆరాధ్య దైవం చౌడేశ్వరీదేవి జయంతి ఉత్సవాలు ఈ నెల 4న నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు సి.సి. హరి తెలిపారు. మొదటిసారి గ్రామంలో అమ్మవారికి బోనాలు సమర్పించే కార్యక్రమం ఉంటుందన్నారు. అమ్మవారికి బోనాలు సిద్ధం చేయడానికి గురువారం మహిళలకు ఉచితంగా కుండలు అందజేశారు. ఆదివారం పెద్దమ్మ ఆలయం నుంచి ప్రదర్శనగా బోనాలు తీసుకుని చౌడేశ్వరి ఆలయం వద్దకు చేరుకోవాలని సూచించారు.

సుప్రీంకోర్టు తీర్పుపై సంబరాలు


మడకశిరలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న దళిత సంఘాల నాయకులు


పరిగిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు

మడకశిర: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో గురువారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళితులు సంబరాలు చేసుకున్నారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి దళిత నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంపిణీ చేశారు. పరస్పరం దళిత నాయకులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వర్గీకరణ కోసం పోరాటం చేసిన మందకృష్ణమాదిగ తదితర ఎమ్మార్పీస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు హనుమంతు, మాజీ ఎంపీటీసీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: సుప్రీం కోర్టు ధర్మాసం ఎస్సీ వర్గీకరణ అంశాన్ని సమర్థించడం హర్షణీయమని దళిత సంఘాల నేతలు రంగనపల్లి రాయుడు, అలుపనపల్లి శ్రీనివాస్ తదితరులు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి దళిత సంఘాల నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ 30ఏళ్ల వర్గీకరణ పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పే నిదర్శనమన్నారు. నాయకులు హనిసేకుంట గోవిందప్ప, ఓబుళనరసింహప్ప, యరగుంటప్ప, ఆంజినేయులు, రాజు, మధు, కృష్ణమూర్తి, మీఎన్ పాళ్యం గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిలో..

లేపాక్షి: ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకం అని ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ సంబరాలు చేసుకున్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనలో అమరులైన వారిని స్మరించుకుని వారి త్యాగాలను గుర్తు చేసుకున్నారు.

హిందూపురం: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సమర్థనీయమని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్, ఎంఈఎఫ్, డండోర నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తాలూకా కమిటీ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు కౌన్సిలర్లు మల్లికార్జున, సతీష్ కుమార్, నాయకులు ఆంజనేయులు, రామకృష్ణ, పెన్నయ్య, తిరుపాల్, బాబయ్య, శివ, రాము, శంకర్, ఆది, అశ్వర్థ, శ్రీరాములు, నాగార్జున, నరసింహులు, రవి,మోహన్‌బాబు, నారాయణ, నరసా, దుర్గా ప్రసాద్, విక్కీ, రాజు, లక్ష్మణ్, నాగరాజు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గోళపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు గంగాధరప్ప ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో తిమ్మరాజు, అశ్వర్థప్ప, రాజు, రవి, గోపి, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

పరిగి: ఎస్సీ వర్గీకరణ అంశంపై గురువారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని మండల ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామాంజి మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా మాదిగల హక్కుల కోసం రాష్ట్రంలో అనేక ఉద్యమాలు చేపట్టామన్నారు. ఈక్రమంలో సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సానుకూల తీర్పును వెలువరించడం శుభపరిణామమన్నారు. ఫలితంగా వివక్షతకు తావు లేకుండా రాజ్యాంగబద్ధంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటూ రాజకీయ రంగంలో తగిన న్యాయం జరుగుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శివశంకర్, మాజీ ఎంపీపీ గోవిందప్ప, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణపతిపల్లి మద్దిలేటి, డీఎస్‌ఎల్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మడకశిరరూరల్: మండలంలోని సిద్దప్ప ఇళ్ల వద్ద గురువారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. శంకరప్ప, అనితమ్మ ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి రోడ్డు పైకి వస్తుండగా మడకశిర వైపునకు వెళుతున్న ద్విచక్ర వాహనదారుడు వారిని ఢీ కొట్టాడు. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు.